వరంగల్ నుంచి రాజధాని సర్వీసులు

హనుమకొండ చౌరస్తా, జూలై 2 : వరంగల్ బస్టేషన్ నుంచి హైదరాబాద్ వరకు రాజధాని ఏసీ సర్వీసులను నడుపుతున్నట్లు వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. రోజు ఉదయం 6, 7, 8 గంటలకు సాయంత్రం 5 గంటలకు వరంగల్‌లో రాజధాని ఏసీ సర్వీసులు అందుబాటులో ఉంటాయని, ప్రయాణికులు సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బల్దియా అదనపు కమిషనర్‌గా కృష్ణారెడ్డి

వరంగల్, జూలై 2 : బల్దియా అదనపు కమిషనర్‌గా కాశీబుగ్గ సర్కిల్-1 డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు కమిషనర్‌గా పనిచేసిన అనీసుర్ రషీద్ ఉద్యోగ విరమణ చేసిన నేపథ్యంలో కృష్ణారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. అలాగే, బల్దియా కార్యదర్శి విజయలక్ష్మి 20 రోజుల పాటు సెలవుల్లో వెళ్లడంతో ఆ బాధ్యతలను సైతం కృష్ణారెడ్డికి అప్పగించారు.

కాంగ్రెస్ నాయకులు దద్దమ్మలు

- అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు
- జెండా మారడంతో గొంతు మార్చుతున్నారు
- కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు

:హనుకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు

హనుమకొండ, జూలై 2 : కాంగ్రెస్ నాయకులు చవటలు, దద్దమ్మలని 45వ డివిజన్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు అన్నారు. రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీపై, నాయకులపై మాట్లాడుతున్న చాలా మంది ఇదే పార్టీతోనే రాజకీయ గుర్తింపు పొందడంతో పాటు అనేక పదవులు అనుభవించారన్నారు. నగర అభివృద్ధికి తట్టెడు మట్టి పోయలేనోళ్లు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాకతీయ కళాతోరణం తొలగిస్తామంటే వరంగల్ కాంగ్రెస్ నాయకులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కళాతోరణం విషయంలో బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేసిందన్నారు. పార్టీ కండువా మారగానే కొందరి గొంతులు మారాయని ఆరోపించారు. సీఎం వరంగల్‌కు వస్తున్నాడంటే నగర అభివృద్ధికి వరాలు ఇస్తారనుకుంటే ఏమి ఇవ్వకుండా వెనుదిరిగారన్నారు. ముఖ్య మంత్రి కేవలం ప్రైవేట్ దవాఖాన ఓపెనింగ్ కోసమే వచ్చారు తప్ప జిల్లా అభివృద్ధిపై సమీక్షించేందుకు రాలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రారంభించిన అభివృద్ధి పనులను మాత్రమే పరిశీలించారన్నారు. కనీసం వరదల మీద కూడా చర్చలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎలాంటి వినతి పత్రం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వరంగల్ నగరం అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ పరిపక్వత లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, వారి సొంత లాభాల కోసమే వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. దమ్ముంటే నిధులు తేవాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నాయకుల కబ్జాలు, భాగోతాలను బయటపెడుతామన్నారు.

నామినేటెడ్ పోస్టుల కోసమే..

కాంగ్రెస్ నాయకుల ప్రెస్‌మీట్ చూస్తే సిగ్గుగా ఉందని, కేవలం నామినేటెడ్ పోస్టులను పొందేందుకు, ఎమ్మెల్యే, పార్టీ మెప్పు పొందేందుకే బీఆర్ఎస్ పార్టీ, నాయకులపై నిరాధారమైన ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు వీరేందర్ పేర్కొన్నారు. వారికి నగర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదన్నారు. నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పాత్ర శూన్యమన్నారు. గత ప్రభుత్వంలో దాస్యం వినయ్ భాస్కర్ తెచ్చిన నిధులతో కొనసాగుతున్న పనులనే మళ్లీ ప్రారంభిస్తున్నారన్నారు. సీఎంకు వినతి పత్రం ఇస్తామంటే విద్యార్థి సంఘాల నాయకులను నిర్బంధించారన్నారు. నిరుద్యోగ సమస్యపై పోరాటం చేస్తున్న మోతీలాల్ పట్ల కాంగ్రెస్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను మోసం చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసేవరకూ బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు సంకు నర్సింగ్, ఇమ్మడి లోహిత, బోయినపల్లి రంజిత్‌రావు, చెన్నం మధు, దివ్యారాణి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

'మహిళలు ఆర్టీసీ లక్కీడ్రా గెలుచుకోవాలి'

హనుమకొండ చౌరస్తా, జూలై 2 : మహిళలు డీలక్స్ బస్సుల్లో ప్రయాణం చేసి, లక్కీడ్రాలో బహుమతులు గెలుచుకోవాలని ఆర్టీసీ ఆర్ఎం విజయభాను సూచించారు. ఆర్టీసీ వరంగల్-1 డిపో పరిధిలో వరంగల్ నుంచి నిజామాబాద్‌కు డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళలను సోమవారం లక్కీ డ్రా ద్వారా ఎంపికచేశారు. కవిత, దేవమణి, రత్న బహుమతులు గెలుచుకున్నారు. డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు మాట్లాడుతూ డీలక్స్ బస్సుల్లో ప్రత్యేక గిఫ్ట్‌బాక్స్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలు బస్సు దిగేముందు తమ టికెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి గిఫ్ట్‌బాక్స్‌లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఆపరేషన్స్ కేశరాజు భానుకిరణ్, అసిస్టెంట్ మేనేజర్ చిమ్మని సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, డీఎం మోహన్‌రావు ఆధ్వర్యంలో హనుమకొండ బస్‌స్టేషన్ ప్రాంగణంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

ఆత్మకూరు పెద్ద చెరువుకు నిధులు తీసుకొస్తా

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

ఆత్మకూరు, జూలై 2: ఆత్మకూరు పెద్ద చెరువు డేంజర్ జోన్‌లో ఉందని, వెంటనే అధికారులు నివేదిక తయారు చేసి ఇవ్వాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం చెరువు కట్టను సుమారు రెండు కిలోమీటర్ల వరకు రైతులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కోతకు గురైన ప్రాంతాన్ని, తూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ ఆత్మకూరు పెద్ద చెరువు కట్ట మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఈఈ సునీత, డీఈ వేణుగోపాల్, ఏఈ జ్యోతిరాణి, ఎంపీపీ మార్క సుమలతారజనీకర్, జడ్పీటీసీ కక్కెర్ల రాధికారాజు, పీఏసీఎస్ చైర్మెన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ బీరం సునందా సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు కమలాపురం రమేశ్, అర్షం వరుణ్‌గాంధీ, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ బయ్య తిరుపతి పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ శ్రీమతి ఇశ్రత్ సుల్తాన, భర్త: మహమ్మద్ అబ్దుల్ అజీమ్, నివాసం: ఇ.నె. 3-1-252, కాకతీయ కాలనీ, హన్మకొండ గారు కోయల్‌కార్ లలితబాయి, భర్త: నరసింగ్‌లాల్, సా॥ ఇ.నెం. 6-7-138, రాయపుర, హన్మకొండ గారి వద్ద వారి యాజమాన్య హక్కుభుక్తములలో, స్వార్జితం దస్తావేజు నెం. 2419/1990, వరంగల్లు ఆర్.ఒ., సర్వే నెం. 578, ప్లాటు నెం. 17, విస్తీర్ణం: 300.00 చ.గ.లు, హన్మకొండ గ్రామము అందులో నిర్మించినటువంటి గృహము ఇ.నెం. 3-16-189/6/ఎ/1, పెద్దమ్మగడ్డ ఏరియా దిగువ హద్దులు కలిగినటువంటి ఆస్తి: తూర్పు: 30 ఫీట్ల రోడ్డు, పడమర: ఇతరుల భూమి, ఉత్తరం: ప్లాటు నెం. 18, మహమ్మద్ లియాఖత్ అలీ, దక్షిణం: ప్లాటు నెం. 16, రాజ్ మహమ్మద్ గారి ఇల్లు, కొని విక్రయ అగ్రిమెంటు చేసుకొనియున్నారు. అట్టిది వారు ఫైనల్ దస్తావేజు చేసుకొనుటకు సంసిద్ధంగా వున్నారు. కావున పై ఆస్తిపై ఎలాంటి లావాదేవీలు, తాకట్టులు, కోర్టు వ్యాజ్యములు, నిషేధ ఆజ్ఞలు, ఇతర హక్కులు ఉన్న ఈ క్రింది చిరునామాకు (7) రోజులలో తెలుపగలరు. ఆ పై ఎలాంటి ఆక్షేపణలు లేవని నిర్ధారించుకొని ఫైనల్ దస్తావేజు చేసుకొనగలరు. కావున తెలియజేయడమైనది.

ఇట్లు: **నమిలికొండ హరిత** M.B.A., LL.B
ఛాంబర్ ప్రాక్టిషనర్,
ఇ.నెం. 6-7-61, రాగన్నదర్వాజ,
హన్మకొండ. వరంగల్. సెల్: 9063065013

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

కొత్త చట్టాలపై అవగాహన కల్పించాలి

సీపీ అంబర్ కిశోర్ ఝా

సుబేదారి, జూలై 2 : కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ముమ్మరంగా ప్రచారం చేపట్టాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పిలుపునిచ్చారు. మంగళవారం కమిషనరేట్‌లో నూతన చట్టాలు, క్రిమినల్ మేజర్ యాక్ట్స్‌పై రూపొందించిన పుస్తకాలను పోలీసు స్టేషన్లకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నూతన చట్టాల ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ నుంచి చట్టాలపై ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు రాగ్యానాయక్, జితేందర్‌రెడ్డి, డేవిడ్‌రాజ్, ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌రావు, సంజీవ్, ఎస్సై రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

హనుమకొండ, జూలై 2 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం సంఘం వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో సుబేదారి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, సమస్యల పరిష్కారానికి విద్యార్థులతో కలిసి అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో స్పందించిన డీఈవో ఆఫీస్ సూపరింటెండెంట్‌ను పంపించి విద్యార్థులతో మాట్లాడించి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మొగిలి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు అధ్వానంగా ఉన్నాయన్నారు. సీఎంకు ప్రభుత్వ పాఠశాలపై చిత్తశుద్ధి ఉంటే తక్షణం శాశ్వత స్కావెంజర్లు, సహాయ సిబ్బందిని నియమించాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు రాచకొండ రంజిత్, మహేశ్, అర్జున్, పవన్ పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్ : ఎస్ఎఫ్ఐ

హనుమకొండ చౌరస్తా/పరకాల, జూలై 2 : నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ గురువారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ తెలిపారు. మంగళవారం హనుమకొండలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నీట్ అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అలాగే, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నేతలపై పెట్టిన అక్రమ కేసులు, నిర్బంధాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

దవాఖానలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

డీఎంహెచ్‌వో సాంబశివరావు

వరంగల్, జూలై 2 : ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు తెలిపారు. అలాగే, అన్ని దవాఖానల్లో ధరల పట్టికలు, డాక్టర్లు, సిబ్బంది పేర్లతో పాటు వైద్య సేవల వివరాలను బోర్డులపై ప్రదర్శించాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని తెలిపారు. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రైవేట్ దవాఖానలు రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాతే వైద్యం ప్రారంభించాలని తెలిపారు. దవాఖానలపై ఫిర్యాదులు ఉంటే డీఎంహెచ్‌వో కార్యాలయ మెయిల్‌కు పంపించాలని సూచించారు.

రీవెరిఫికేషన్‌లో విద్యార్థిని ప్రతిభ

సింధూరరెడ్డి

హసన్‌పర్తి, జూలై 2 : మండలంలోని ఎల్లాపూర్ శివారులోని ఆర్బిట్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థిని సింధూర రెడ్డి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించింది. కాగా, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా 10/10 జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ సీహెచ్ భగవాన్‌రెడ్డి తెలిపారు. అనంతరం విద్యార్థినిని పాఠశాల డైరెక్టర్ హారికారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

వేలేరును అభివృద్ధి చేసేందుకు కృషి

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

పాలకవర్గాన్ని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కడియం

వేలేరు, జూలై 2 : నూతనంగా ఏర్పడిన వేలేరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఎంపీటీసీలను శాలువాతో సత్కరించారు. అంతకుముందు మండల కేంద్రంలోని గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల, గొల్లకిష్టంపల్లిలోని కేజీబీవీ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం రైతువేదికలో తహసీల్దార్ హెచ్ కొమి ఆధ్వర్యంలో 46 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చాడ సరితారెడ్డి, వైస్ఎంపీపీ సంపత్, కోఆప్షన్ జానీ, ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, ఎంపీవో విమల, మాజీ సర్పంచ్‌లు మల్లికార్జున్, రాజిరెడ్డి, నాయకులు బిల్లా యాదగిరి, భూపతిరాజ్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

దామెర, జూలై 2 : మండలంలోని ల్యాదెళ్ల శివారులో గంజాయిని పట్టుకున్న కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు, ఎస్సై కొంక అశోక్ మంగళవారం తెలిపారు. సీఐ, ఎస్సై కథనం ప్రకారం.. గత ఏప్రిల్ 16న ల్యాదెళ్ల శివారులో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కొంత మంది కనిపించారు. అంతలో ముగ్గురు వ్యక్తులను పట్టుకుని 140 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదే కేసులో అప్పుడు పరారైన ఖమ్మం జిల్లాకు చెందిన మహ్మద్ అఫ్రోజ్, తమ్మిశెట్టి ఆనంద్ మంగళవారం పోచమ్మమైదాన్‌లో ఉన్నారనే సమాచారం మేరకు వెళ్లి వారిని అరెస్టు చేసినట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

తల్వార్లు తిప్పిన ఇద్దరిపై కేసు

సుబేదారి, జూలై 3 : హనుమకొండ చౌరస్తా రోడ్డులో మారణాయుధాలైన తల్వార్లు తిప్పిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సతీశ్ తెలిపారు. ఈ నెల 30 అర్ధరాత్రి దర్శన్‌సింగ్, భజ్జిత్ సింగ్ తల్వార్లు తిప్పుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి వెళ్లగా వారి విధులకు ఆటకం కలిగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పోలీసు సిబ్బంది మధుసూదన్, మౌలాత్ ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బార్ షాప్‌లో యువకుడి మృతి

సుబేదారి, జూలై 2 : మద్యం సేవించి బార్‌షాపులోనే యువకుడు మృతిచెందిన సంఘటన హనుమకొండ పీఎస్ పరిధిలో జరిగింది. జాగృతి నగర్‌కు చెందిన నులిమి మల్లికార్జున్ మద్యానికి బానిస కావడంతో భార్య వదిలి వెళ్లిపోయింది. దీంతో అతడు అనారోగ్యానికి గురికాగా కుటుంబ సభ్యులు టీబీ దవాఖానలో చేర్పించారు. అయితే, మల్లికార్జున్ అక్కడి నుంచి తప్పించుకొని నయీంనగర్‌లోని భద్రుక బార్‌లో మద్యం సేవించి, వాటర్ కోసం వెళ్లి కిందపడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు

వృద్ధుడి ఆత్మహత్య

ఎల్కతుర్తి, జూలై 2 : అనారోగ్య సమస్యలు తాళలేక వృద్ధుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్కతుర్తి ఎస్సై గోదారి రాజుకుమార్ కథనం ప్రకారం.. మండలంలోని దామెర గ్రామానికి చెందిన మంద చిన్నరాజుమొగిలి(71) కొన్నేళ్లుగా మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్నాడు. వ్యాధి ఎక్కువ కావడంతో మంగళవారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఉదయం కుమారుడు మంద రవి చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు జడ్పీ పాలక వర్గం వీడ్కోలు సమావేశం

హనుమకొండ, జూలై 2 : వరంగల్ అర్బన్ జడ్పీ పాలకవర్గం వీడ్కోలు సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో ఎం విద్యాలత ఒక ప్రకనటలో తెలిపారు. 4వ తేదీతో పాలకవర్గం పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

రేపు ఎల్బీ కాలేజీలో గోల్డెన్ జూబ్లీ

హనుమకొండ చౌరస్తా, జూలై 2 : ములుగురోడ్డులోని ఎల్బీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ వేడుకలు గురువారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. మంగళవారం కాలేజీలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. వేడుకలకు మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ సదానందం, బీ ప్రభాకర్, కే సుధాకర్, వీ మధుకర్‌రావు పాల్గొన్నారు.

రేపు ఇంటర్వ్యూలు

నయీంనగర్, జూలై 2 : వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి డిగ్రీ, పీజీ కళాశాల(అటానమస్)లో వివిధ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకుల నియామకం కోసం గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. బయోటెక్నాలజీ, స్టాటిస్టిక్స్, అప్లైడ్ న్యూట్రిషన్‌లో ఒకటి చొప్పున, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ 2 పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు సంబంధిత సర్టిఫికెట్లతో రావాలని సూచించారు.

6న వరంగల్ ఐటీఐలో వేలం

హనుమకొండ చౌరస్తా, జూలై 2 : వరంగల్ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్స్(ఏటీసీలు) నిర్మించేందుకు చెట్లు తొలిగించడానికి ఈ నెల 6న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

పాఠశాల ఎదుట ధర్నా

ఎల్కతుర్తి, జూలై 2 : మండల కేంద్రంలో అనుమతి లేకుండా 8,9,10 తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శ్రీచైతన్య పాఠశాల ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎంఈవో రవీందర్ పాఠశాలకు చేరుకొని తరగతులను సీజ్ చేశారు. నాయకులు భాషబోయిన సంతోష్, ఉట్కూరి ప్రణీత్‌గౌడ్, వేల్పుల చరణ్, కుమార్ పాల్గొన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం'

వరంగల్, జూలై 2 : ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి విమర్శించారు. మంగళవారం హంటర్‌రోడ్డులో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రూప్స్‌లో పోస్టులు పెంచుతాం, జీవో 46ను రద్దు చేస్తాం, మెగా డీఎస్సీ వేస్తామని ఇచ్చిన హామీలని వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వీటిపై నిలదీస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రైవేట్ దవాఖానపై ఉన్న ప్రేమ ప్రభుత్వ దవాఖానలపై లేదన్నారు. సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, జిల్లా నాయకులు కొండి జితేందర్ రెడ్డి, కందగట్ల సత్యనారాయణ, నర్మెట్ట శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ మెంబర్‌గా ఇస్తారి

హనుమకొండ చౌరస్తా, జూలై 2 : లండన్‌లోని ప్రతిష్టాత్మక రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీలో కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి మెంబర్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు లండన్ నుంచి ఈ-మెయిల్ వచ్చినట్లు ఇస్తారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఇప్పటికే 100కు పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ఈ మేరకు యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ గెజిటెడ్ పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ కార్యవర్గం

హనుమకొండ చౌరస్తా, జులై 2 : తెలంగాణ గెజిటెడ్ పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ప్రభుత్వ విప్ డాక్టర్ రామ చంద్రనాయక్, ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ శ్రీనాథ్, ఎస్‌బీటీఈటీ సెక్రటరీ పుల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీజీపీఏఎల్‌ఏ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా నరసయ్యగౌడ్, అధ్యక్షుడిగా కేఎస్ చక్రవర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా వై కృష్ణ, ట్రెజరర్‌గా బీ రాజా, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా సురేశ్, శ్రావణ్ కుమార్, రవి పవార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం రవి, సర్వేశ్, రాజేందర్, డీ శ్రీనివాస్, కే శ్రీనివాస్, రాజకుమార్, నరేశ్ ఎన్నికయ్యారు. అనంతరం ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాల సికింద్రాబాద్ ప్రిన్సిపాల్‌గా ఉద్యోగవిరమణ పొందిన అధ్యక్షుడు నరసయ్యగౌడ్‌ను సన్మానించారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఇదే..

మారుతి కాలనీ నూతన కమిటీ ఎన్నిక

నయీంనగర్, జూలై 2 : గ్రేటర్ 56వ డివిజన్ మారుతి కాలనీ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బాలు నాయక్, అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా వెంకట్రాం, ప్రధాన కార్యదర్శిగా సునీల్, కోశాధికారిగా రాజు గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రవీందర్, మీడియా ఇన్‌చార్జిగా సురేశ్ రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్ వారికి శాలువా కప్పి సత్కరించారు.

'వంగపల్లి దీక్షకు తరలిరావాలి'

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

హనుమకొండ, జూలై 2: ఎస్సీ వర్గీకరణపై జాప్యం చేస్తున్న కేంద్ర వైఖరికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ చేపట్టనున్న దీక్షకు మేధావులు, రాజకీయ నాయకులు, కుల సంఘాల నాయకులు తరలిరావాలని జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేశ్‌కన్నా పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సిలువేరు సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు అంబాల చక్రపాణి, జన్ను సంజీవ్, మాస్ ప్రవీణ్, గిన్